విశాలాంధ్ర అనంతపురం
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 22, సెప్టెంబర్2023

అక్రమ అరెస్టులు వైకాపా పతనానికి నాంది..

సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్

చంద్రబాబు అరెస్ట్‌పై వామపక్షాల నిరసనలు

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టుపై వామపక్ష పార్టీల నాయకులు గురువారం నిరసన కార్యక్రమాలు చేపట్టడంతో స్థానిక టవర్ క్లాక్ వద్ద పోలీసులు అరెస్టు చేసి టూ టౌన్ పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. సిపిఐ జిల్లా కార్యదర్శి జాఫర్ మాట్లాడుతూ. మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఎఫ్ఐఆర్‌లో పేరు లేకుండా అరెస్టు చేయడం అమానుషమన్నారు. సుప్రీం కోర్టు కూడా అరెస్టు సరైనది కాదని చెప్పడం జరిగిందని పేర్కొన్నారు. దేశంలో స్కిల్ డెవలప్మెంట్ ఎనిమిది రాష్ట్రాల్లో ఉందన్నారు. మద్దతు మొట్టమొదటి స్కిల్ డెవలప్మెంట్ గుజరాత్ మొదటి రాష్ట్రం అయితే ఏపీలోని 42 కేంద్రాలలో దాదాపు రెండు లక్షల పదమూడు వేల మంది యువత శిక్షణ పొందగా 70 వేల మందికి ఉద్యోగాలు వచ్చాయన్నారు. అంతర్జాతీయ స్థాయిలో చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా ఉద్యమాలు చేస్తున్నారంటే ప్రభుత్వానికి చెంపపెట్టు అన్నారు. ముఖ్యమంత్రి లండన్ నుంచి రాగానే రామోజీరావు, ఎండి శైలజపై మార్గదర్శి లో అన్యాయం జరిగిందంటూ అరెస్టు చేస్తారన్న వార్తలు వస్తున్నామన్నారు. త్వరలో నారా లోకేష్‌ని కూడా అరెస్టు చేస్తామని బహిర్గతంగా చెప్పడం చూస్తుంటే రానున్న కాలంలో వైకాపాకి పతనానికి కారణం అవుతుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఐ నగర కార్యదర్శి శ్రీరాములు, సహాయ కార్యదర్శి అలిపిర, చాంద్ భాషా, జనసేన నాయకులు అంకె ఈశ్వర్, బాబు, ఈశ్వరి, ఉరుముల సుమలత, గంటా దేవి, మహేశ్వరి, మారుతి తదితరులు పాల్గొన్నారు.

రక్షించే అధికారే దొంగైతే ఆలయాల పరిస్థితి ఏంటి?

భక్తులిచ్చిన బంగారం, వెండి ఎక్కడికి పోతోంది..?

ఆలయంలో ఇంకా ఎంతమంది దొంగలున్నారో..

దొంగతనాలేనా ఇంకా ఏమి అవినీతి జరుగుతున్నదో.. ఏసీబీ తేల్చాలి.. ?

సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు డి.జగదీష్

విశాలాంధ్ర–గుంతకల్లు: కసాపురం దేవస్థానంలో దొంగతనం జరిగిన హుండీని గురువారం సీపీఐ బృందంతో సిపిఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు డి.జగదీష్ పరిశీలించారు. అనంతరం ఆలయ ఈవో వెంకటేశ్వరరెడ్డితో దొంగతనం విషయంపై చర్చించారు. విలేకరుల సమావేశంలో డి.జగదీష్ మాట్లాడుతూ...పవిత్రమైన దేవస్థానాలలో అధికార పార్టీ జోక్యం ఎక్కువవుతోందన్నారు. ప్రతి టెండర్‌పైన గుడ్ విల్ ఎక్కువైదని అన్నారు.కసాపురం దేవస్థానంలో ఆరు నెలల నుంచి హుండీ దొంగతనాలు జరుగుతున్నట్లు స్వయానా పాలకమండలి సభ్యుడు చెప్పారని, హుండీ దొంగతనాలు చేస్తుంటే అధికారులు ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. ఇక భక్తాదులు ఇచ్చిన బంగారు,వెండి ఎక్కడికి తరలిపోతున్నాయని ప్రశ్నించారు. ఈ నెల 16 వ తేదీన దేవస్థానంలో సెక్యూరిటీ గార్డ్ గా పని చేస్తున్న కృష్ణారెడ్డి హుండీలో నుంచి దొంగతనం చేస్తూ దొరికిపోయాడన్నారు. ఈ దొంగతనానికి కారణం కృష్ణారెడ్డి ఒకటే కాదు అతని వెనక ఉన్న అదృశ్య శక్తులు ఎవరు అన్నది తేల్చాలన్నారు. అధికార పార్టీ, అధికారుల హస్తాలు ఏమైనా ఉన్నాయాని ప్రశ్నించారు. భాగస్వామ్యులైన అందరినీ బయటకు తేవాలని ఏసీబి అధికారులను కోరారు. స్వామివారికి వెండి బంగారం కూడా భక్తులు ముడుపులు మాదిరిగా ఇస్తుంటారన్నారు. ఇవన్నీ ఏ రూపంలో మీరు పెడతారన్నారు. అక్కడ పనిచేస్తున్న కార్మికులకు జీతాలు రాక దేవస్థానం అపరిశుభ్రం ఎక్కువైదని దీనిపై కూడా స్థానిక ఎమ్మెల్యే, జిల్లా ఇన్‌చార్జి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి కూడా స్పందించాలన్నారు. దొంగతనానికి పాల్పడిన కృష్ణారెడ్డి అతనితో పాటు ఎవరెవరు ఉన్నారో వారిపై చర్యలు తీసుకొని వారిని తొలగించా లని డిమాండ్ చేశారు. దేవస్థానం గదుల్లో పరిసర ప్రాంతాల్లో సీసీటీవీలు ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు గోవిందు, నియోజకవర్గ కార్యదర్శి వీరభద్రస్వామి, సిపిఐ మండల కార్యదర్శి రాము రాయల్, సహాయ కార్యదర్శి రామాంజనేయులు, ఏఐటియుసి మండల కార్యదర్శి ఈశ్వరయ్య, వెంకట్ నాయక్ పాల్గొన్నారు.

అణచివేతకు గురి చేస్తే తిరుగుబాటు తప్పదు

- సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్
- టిడిపి శాంతియుత ర్యాలీకి సీపీఐ సంఘీభావం

విశాలాంధ్ర బ్యూరో అనంతపురం : మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా గురువారం జిల్లా కేంద్రంలో తెలుగు దేశం పార్టీ చేపట్టిన శాంతి ర్యాలీకి సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్, పలువురు ఆపార్టీ నాయకులు సంఘీభావం తెలిపారు. ఓ దశలో ర్యాలీ నిర్వహించకూడదని పోలీసులు ఆంక్షలు విధించినా ఎట్టకేలకు అర్బన్ మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి నేతృత్వంలో టీడీపీ, సీపీఐ నాయకులు వందలాదిమంది శ్రేణులతో కలసి శాంతి ర్యాలీ విజయవంతం చేశారు. ఈ సందర్భంగా జగదీష్ మాట్లాడుతూ ప్రతిపక్షాలను అలచివేతకు గురిచేస్తే వైసీపీ ప్రభుత్వంపై ప్రజలే తిరుగుబాటు చేస్తారని విమర్శించారు. సిఎం జగన్ తన తప్పు తెలుసుకొని చంద్రబాబుపై పెట్టిన స్కిల్ డెవలప్మెంట్ కేసును ఉపసంహరించుకుని వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జనసేన నాయకులు భవాని రవికుమార్, ఆయా పార్టీల.నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

చంద్రబాబు అరెస్టుతో వైసీపీ నాయకుల వెన్నులో వణుకు

మాజీ మంత్రి పరిటాల సునీత

విశాలాంధ్ర–రామగిరి: టిడిపి అధినేత చంద్రబాబు అరెస్టు తరువాత వైసిపి నాయకుల వెన్నులో వణుకు మొదలైందని మాజీ మంత్రి పరిటాల సునీత అన్నారు. చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టుకు నిరసనగా రామగిరి మండలం పేరూరులో రాప్తాడు నియోజకవర్గ తెలుగు మహిళల ఆధ్వర్యంలో రిలే దీక్షలు చేపట్టగా మాజీ మంత్రి పరిటాల సునీత సంఘీభావం తెలిపారు. అనంతరం మహిళలతో కలిసి పేరూరులో భారీ ర్యాలీ నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఎమ్మెల్యే బాలకృష్ణ గురించి నోరు అదుపులో పెట్టుకోకుంటే అంబటి రాంబాబు తగిన మూల్యం చెల్లించుకుంటారన్నారు. చంద్రబాబును అనవసరంగా అరెస్టు చేయించామన్న భయం వైసిపి నాయకుల్లో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. రాప్తాడు ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి పేరూరు జలాశయానికి నీరు ఇస్తానని ప్రగల్భాలు పలికారని.. ఆయన చేసింది ఏమి లేదన్నారు. ఎమ్మెల్యే సోదరులు చేసిన అక్రమాలపై ఖచ్చితంగా విచారణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో రామగిరి మాజీ జడ్పీటీసీ సభ్యుడు రామ్మూర్తినాయుడు, తెలుగు యువత మండల అధ్యక్షుడు శ్రీధర్, రామసుబ్బమ్మ, అనిత, సుకన్య, ధనలక్ష్మి పాల్గొన్నారు.

రీసర్వే లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలి..

– జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం: విజయవాడ సిసిఎల్ఏ కార్యాలయం నుండి గురువారం వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకం, రీ సర్వే, తదితర అంశాలపై కలెక్టర్ లు, జాయింట్ కలెక్టర్లతో సిసిఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ మరియు భూ పరిపాలన ప్రధాన కార్యదర్శి జి.సాయి ప్రసాద్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. అనంతపురం నగరంలోని జిల్లా కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ లో జిల్లా కలెక్టర్ యం.గౌతమి, జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్, తదితరులు పాల్గొన్నారు. వీడియో కాన్ఫరెన్స్ అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడారు. జిల్లాలో రీసర్వే లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎం.గౌతమి సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వైఎస్సార్ జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకం కింద రీసర్వే ప్రక్రియను వేగవంతంగా చేపట్టాలన్నారు. జిల్లాలో రీసర్వేలో భాగంగా మొదటి విడుతలో 43 గ్రామాల్లో స్టోన్ ప్లాంటేషన్ పూర్తికాగా, రెండవ విడుతలో 40 గ్రామాల్లో గ్రౌండ్ టు థింగ్, ఇతర ప్రక్రియలు పూర్తి కాగా, గురువారంతో స్టోన్ ప్లాంటేషన్ ప్రక్రియ కూడా పూర్తికావడం జరిగిందన్నారు. ఇప్పటికే మూడవ విడుతలో రీసర్వే ప్రక్రియ మొదలుకాగా, జిల్లాలో ఎంపిక చేసిన గ్రామాల్లో వేగంగా రీసర్వే యాక్టివిటీలను చేపట్టి సకాలంలో లక్ష్యాలను పూర్తి చేసేలా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పెండింగ్ ఉన్న భుహక్కు పత్రాల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. మ్యుటేషన్ దరఖాస్తులను ఎప్పటికప్పుడు పెండింగ్ లేకుండా నాణ్యతగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సిసిఎల్ఏ స్పెషల్ చీఫ్ సెక్రటరీ జి.సాయి ప్రసాద్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం భూ హక్కు పత్రాల పంపిణీకి సంబంధించి ప్రత్యేక దృష్టి సారించిందని, శనివారం నాటికి ఫేస్ 2 కింద పెండింగ్లో ఉన్న భూ హక్కు పత్రాలు పంపిణీ చేసేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. డిసెంబర్ 31 నాటికి రీ సర్వే పూర్తి చేసి సరిహద్దు రాళ్ల ఏర్పాటు చేసి భూహక్కు పత్రాలను కూడా పంపిణీ గావించి ఫైనల్ ఆర్వోఆర్ పూర్తి చేసేలా చర్యలు చేపట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్వే ఆఫ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడి రూప్లనాయక్, తహసిల్దార్ వాణిశ్రీ, తదితరులు పాల్గొన్నారు.

22వ తేదీన ఆత్మకూరు మండలంలో జగనన్నకు చెబుదాం

విశాలాంధ్ర–అనంతపురం వైద్యం : ఈనెల 22వ తేదీన ఆత్మకూరు మండల కేంద్రంలో మండల స్థాయి జగనన్నకు చెబుదాం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎం.గౌతమి తెలిపారు. ప్రతివారంలో బుధవారం, శుక్రవారం మండల స్థాయి జగనన్నకు చెబుదాం, స్పందన గ్రీవెన్స్ కార్యక్రమాన్ని నిర్వహించడంలో భాగంగా ఆత్మకూరు మండల ప్రజల కోసం ఈనెల 22వ తేదీన శుక్రవారం ఆత్మకూరు మండల కేంద్రంలో కనకదాస్ కళ్యాణ మండపంలో జగనన్నకు చెబుదాం.. కార్యక్రమాన్ని ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఉదయం 10:00 గంటల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తామన్నారు.

రైతులకు నష్ట పరిహారం చెల్లించాలి

విశాలాంధ్ర–కూడేరు: తీవ్ర వర్షాభావ పరిస్థితుల వల్ల ఖరీఫ్లో సాగుచేసిన పంటలు పూర్తిగా నష్టపోయారని ఏపీ రైతు సంఘం నాయకులు గురువారం రైతు భరోసా కేంద్రంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంటల సాగు చేసి నష్టపోయిన రైతులకు ఎకరాక 50 వేలు ఇవ్వాలని, రైతు రుణాలు వెంటనే మాఫీ చేయాలని, క్రొత్త రుణాలు మంజూరు చేయాలని తదితరు డిమాండ్లతో వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు నారాయణరెడ్డి, కరీం, వీరప్ప, చిదంబరమ్మ, రైతులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు

విశాలాంధ్ర–యాడికి: మండలంలోని రాయల చెరువు నెం1మండల పరిషత్ పాఠశాలలో గురువారం తాడిపత్రి డివిజన్ జిపియంవోవో మధు సూదనరాజు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంలో భాగంగా, జిల్లా సివిల్ సర్జన్ డా.సైదన్న ఆదేశాలమేరకు 61 మంది విద్యార్థులకు ఉచిత కంటిపరీక్షలు నిర్వహించారు. అవసరమున్న ముగ్గురు విద్యార్థు లకు ఉచితంగా కళ్ళ అద్దాలు అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఇన్‌ఛార్జ్ ప్రధానోపాధ్యాయులు పీ.జయమ్మ,మునేశ్వరి పాల్గొన్నారు.

చంద్రయాన్-3 సైంటిస్టుకు అభినందన

విశాలాంధ్ర - జెఎన్టియు ఏ : చంద్రయాన్-3బెంగళూరులోని యు.ఆర్.రావు శాటిలైట్ సెంటర్‌లో సైంటిస్ట్ 'సి' సైంటిస్టు అనమల ఇంజనీ రింగ్ కళాశాల ఇ.సి.ఇ. విభాగం పూర్వవిద్యార్థి కుమారి సాయి చందనను కాలేజీ ప్రిన్సిపల్ ఆచార్య ఎస్వి సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపల్ అరుణ క్రాంతి అభినందించారు. అనంతరం పూర్వ విద్యార్థి మాట్లాడుతూ.. చంద్రయాన్-3 మిషన్‌లో పాల్గొనడం నాకు ఎంతగానో సంతృప్తిని ఇచ్చిందన్నారు. ప్రతి విద్యార్థి కలల స్వప్నాన్ని నెరవేర్చేందుకు నిరంతరం కృషి చేయాలి అన్నారు. పూర్వ విద్యార్థిని ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్, ఈసీఈ విభాగాధిపతి ఆచార్య యస్. చంద్ర మోహన్ రెడ్డి, ఆచార్యులు ఆచార్య పి.రమణా రెడ్డి, ఆచార్య వి.సుమలత, డి.విష్ణు వర్ధన్, డాక్టర్ మమత, డాక్టర్ అరుణ మస్తానీ సన్మానించారు.

కర్ణాటక మద్యం స్వాధీనం

విశాలాంధ్ర–రాప్తాడు: మండలంలోని పాలచెర్ల గ్రామంలో కర్ణాటక మద్యం అక్రమంగా అమ్ముతున్నారన్న పక్కా సమాచారంతో తలారి అహోబిలప్ప, బోయ పెద్దన్న, బింగి రాయమ్మలను అరెస్ట్ చేసి వారి హైవార్డ్స్ చీర్స్ విస్కీ 90ఎంఎల్ 72 టెట్రా పాకెట్స్, 180ఎంఎల్ 10 పాకెట్స్ మొత్తం 82 పాకెట్స్ స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరచగా. జడ్జి రిమాండ్ విధించారని తెలిపారు. మండలంలో అసాంఘిక కార్యకలాపాలు నిర్వహిస్తే 9440796817 నంబర్‌కు సమాచారం ఇస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి

విశాలాంధ్ర–యాడికి: మండలంలో ఈ నేల13 న చెన్నై నుండి ఆధోనికి నలుగురు వ్యక్తులతో కలిసి డ్రైవర్ వెల్తూ మార్గమధ్యంలోని యాడికి సమీపాన ప్రమాదానికి గురైన విషయం తెలిసిందే. చెన్నై ప్రభుత్వ హాస్పిటల్ నందు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్సై గురుప్రసాద్ రెడ్డి తెలిపారు. మృతుని భార్య వసంతి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చెన్నై ప్రభుత్వ హాస్పిటల్‌లో పోస్టుమార్టం పూర్తి చేయించామన్నారు. మృతునికి ఇద్దరు కూతుర్లు.

వివాదాలకూ తావులేకుండా రీసర్వే

విశాలాంధ్ర- రాప్తాడు: భూవివాదాలకు లేకుండా రీసర్వే చేస్తామని తహశీల్దార్ లక్ష్మీనరసింహ తెలిపారు. వైఎస్ఆర్ జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం 'మీ భూమి - మా హామీ'లో భాగంగా గురువారం చెర్లోపల్లి, మరూరు, గోళ్లపల్లి, కృష్ణాపురం గ్రామాల రైతులతో సమావేశం నిర్వహించారు. ప్రభుత్వం వందేళ్ల తర్వాత ఆధునిక సమగ్ర భూ రీ సర్వే మంచి సంస్కరణలకు శ్రీకారం చుట్టిందన్నారు. నిర్దిష్టమైన హద్దులు, పట్టాదారు పాసు పుస్తకాలు అందించడం, వాటిని ఆధునిక సాంకేతికత ద్వారా సరిహద్దు రాళ్ల ఏర్పాటు, డిజిటల్ పద్ధతిలో భూ రికార్డులను భద్రపరచడం జరుగుతుందన్నారు.

విద్యారంగం, ఉపాధ్యాయ సమస్యలపై అలుపెరగని పోరాటం

యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు

ఉరవకొండకి చేరుకున్న జాత

విశాలాంధ్ర–ఉరవకొండ: గడచిన 50 సంవత్సరాల కాలంలో ప్రభుత్వ విద్యా రంగాన్ని కాపాడుకుంటూనే ఉపాధ్యా యులు ఎదుర్కొంటున్న అనేక సమస్యలపై యుటిఎఫ్ అలుపెరుగని ఎన్నో పోరాటాలను నిర్వహించి విజయాలను సాధించిందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు వెంకటేశ్వర్లు అన్నారు. యుటిఎఫ్ ఆవిర్భవించి 50 సంవత్సరాలు ఆయన సందర్భం గా రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న స్వర్ణోత్సవ సంబరాలలో భాగంగా ప్రచార జాతా గురువారం సాయంత్రం ఉరవకొండకు చేరుకున్నది. రాష్ట్ర అధ్యక్షులు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యారంగాన్ని కాపా డుకుందాం, ప్రభుత్వ పెన్షన్‌ని రక్షించుకుందాం అనే నినాదంతో ఆంధ్రప్రదేశ్ ఐక్యపాధ్యాయ ఫెడరేషన్ ఏర్పడిందన్నారు

దర్గాలో ప్రార్థనలు ..

విశాలాంధ్ర–బొమ్మనహాల్: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు త్వరగా విడుదల కావాలని ఆ పార్టీ నాయకులు గురువారం దర్గా హెరాన్నూర్‌లోని వన్నూరు స్వామి దర్గాలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. 101 టెంకాయలు కొట్టారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ కేశప్ప, ఎస్సీసెల్ అధ్యక్షులు ఆనంద్, సల్మాన్ వలి, ముక్కన్నా, మహమ్మద్ రఫీ, రియల్ రామాంజనేయులు, రామస్వామి పాల్గొన్నారు.

వ్యకాస రాష్ట్ర మహాసభలకు తరలిరండి..

జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవ రెడ్డి

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: సీపీఐ అనుబంధం ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం 22వ రాష్ట్ర మహాసభలకు వ్యవసాయ కార్మికులు,రైతు కూలీలందరూ తరలి రావాలని ఆ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కేశవరెడ్డి, కార్యవర్గ సభ్యుడు రామాంజినేయులు పిలుపు నిచ్చారు.ఈమేరకు గురువారం ఆ సంఘం కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. ఈ నెల 25 26 27 తేదీల్లో బాపట్ల జిల్లా కేంద్రంలో జరుగునున్నాయన్నారు. ఎపి వ్యాప్తంగా గ్రామీణ ప్రాంతాల్లో అత్యధికులు వ్యవసాయ కూలీలుగా జీవిస్తున్నారని గుర్తు చేశారు.గ్రామీణ ప్రాంతాల్లోని కార్మిక ,దళిత, గిరిజన, బడుగు బలహీన వర్గాలు, మైనార్టీల సమస్యల పరిష్కారం,ఉపాధి ,సాగు భూముల పంపిణీ,సామాజిక న్యాయం కోసం అనేక పోరాటాలు చేసిన ఘనత వ్యకాస కే దక్కిందని కొనియాడారు. బాపట్ల లో జరిగే మహాసభలు వేదికగా వ్యకాస కార్మికులు,రైతు కూలీల సంక్షేమం కోసం భవిష్యత్తు కార్యాచరణను రూపొందించి పాలక ప్రభుత్వాలపై పోరాడుతామన్నారు. మహాసభల సందర్భంగా 25 న కూలి దండు మహాయాత్ర ప్రదర్శన, బహిరంగ సభ ఉంటాయన్నారు. ఈ బహిరంగ సభకు సిపిఐ జాతీయ కార్యదర్శి నారాయణ బికెఎమ్యు జాతీయ ప్రధాన కార్యదర్శి గుల్జార్ సింగ్ గోరియా, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ ముఖ్య అతిధులుగా హాజరౌతారని స్పష్టం చేశారు.ఈ ప్రదర్శనకు అనంతపురం జిల్లా నుండి 400 మంది వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు, వ్యవసాయ కూలీలు పాల్గొంటున్నారని తెలిపారు.

చంద్రబాబు అరెస్టు దారుణం

నిరసన ర్యాలీలు, దీక్షలు

నిరసన ర్యాలీలో పాల్గొన్న టిడిపి దళిత సంఘం నాయకులు

విశాలాంధ్ర–ఉరవకొండ: టీడీపీ జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అరెస్టుకు నిరసనగా ఉరవకొండ పట్టణంలో గురువారం తెలుగు దేశం పార్టీ దళిత విభాగం నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి ర్యాలీ నిర్వహించారు. రిలే నిరాహార దీక్ష కార్యక్రమంలో పాల్గొని నిరసన తెలిపారు. ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నిజాయితీ పరుడైన చంద్రబాబునాయుడును అక్రమంగా జైల్లో పెట్టా రని ఆరోపించారు. టీడీపీ పాలనలో దళితుల అభివృద్ధికి చంద్రబాబునాయుడు ఎనలేని కృషి చేశారని అలాంటి వ్యక్తిని అక్రమంగా నిర్బంధించడం శోచనీయమన్నారు. గడిచిన 45 సంవత్సరాల కాలంలో చంద్రబాబు నాయుడు నిరంతరం రాష్ట్ర అభివృద్ధి ప్రజల సంక్షేమం కోసమే పని చేశారని అలాంటి వ్యక్తిని రాజకీయంగా ఎదుర్కోలేక అక్రమ కేసులు నమోదు చేయిస్తుందని వారు ఆరోపించారు. చంద్రబాబుపై పెట్టిన అక్రమ కేసులు ఎత్తివేయాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో ఆ పార్టీ దళిత విభాగం నాయకులు, టిడిపి సీనియర్ నాయకులు కూడా పాల్గొన్నారు.

ఆటో డ్రైవర్లకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి ..

విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: ఆటో,రవాణా రంగాలపై ఆర్థిక భారం మోపే జీవో నెంబర్లు 21, 31 ని వెంటనే రద్దు చేయాలని ఏఐటియుసి జిల్లా ఉప ప్రధాన కార్యదర్శి మల్లికార్జున కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. గురువారం నగరంలోని ఓ ఆటో స్టాండ్ వద్ద పలువురు ఆటోవాలాలతో కలసి విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఆటోలు, టాటా మ్యాజిక్ వ్యాన్లు,కార్లు,జీపులు, లారీలు, ప్రైవేటు బస్సులు, మోటార్ సైకిళ్ళ పై భారీగా జరిమానాలు పెంచే జీవో నెంబర్ 21,31 లను రద్దు చేయాలన్నారు. ఓడిలు రద్దు చేయాలని సిఎన్జి,ఎల్పిజి గ్యాస్ ధరలు తగ్గించాలన్నారు. ప్రభుత్వం డ్రైవర్లకు గ్రూప్ ఇన్సూరెన్స్ చేయాలన్నారు.ఈ నెల 23 న జిల్లా కేంద్రంలోని రవాణా శాఖ కార్యాలయం ఎదుట ధర్నాకు పెద్దఎత్తున ఆటో తదితర వాహనాల డ్రైవర్లు తరలిరావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో అనంతపురం ఆటో డ్రైవర్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు, నగర నాయకులు కృష్ణ నాయక్ ,అస్మత్,లక్ష్మి ,చందన, లక్ష్మీ నరసింహ పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి..

విశాలాంధ్ర–బొమ్మనహాళ్: ఖరీఫ్ సీజన్లో సాగు చేసిన రైతులు తమ పంటలను ఈ క్రాప్ బుకింగ్ ద్వారా నమోదు తప్పనిసరిగా చేయించుకోవాలని రాయదుర్గం ఏడిఏ లక్ష్మణ నాయక్ తెలిపారు.గురువారం మండలంలోని బొమ్మనహాల్, ఉద్దేహాల్ గ్రామాలలో జరుగుతున్న పంట నమోదు ప్రక్రియ కార్యక్రమాన్ని పరిశీలించారు.ఈనెల 30 తేదీలోపు పంట నమోదు ప్రక్రియ పూర్తి చేయాలని వీఏఏలకు సూచించారు.

అనంత జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలి..

- 23 న రౌండ్ టేబుల్ సమావేశం..
- ఏపీరైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున
-ప్రధాన కార్యదర్శి చిన్నప్ప యాదవ్



విశాలాంధ్ర బ్యూరో–అనంతపురం: అనంతపురం జిల్లాను కరువు జిల్లాగా ప్రకటించాలని సిపిఐ అనుబంధం ఎపి రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ మల్లికార్జున,జిల్లా ప్రధాన కార్యదర్శి చిన్నప్ప యాదవ్ పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని కామ్రేడ్ నీలం రాజశేఖర రెడ్డి భవన్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా దాదాపు 10 లక్షల ఎకరాలకు పైగా వేరుశనగ, పత్తి, ఆముదము తదితర పంటలు సాగు చేయాల్సి ఉందన్నారు.అయితే ఖరీఫ్ లో తీవ్ర వర్షాభావం వల్ల దాదాపు 6 లక్షల ఎకరాల్లో మాత్రమే పంటలు వేసినట్లు వ్యవసాయ లెక్కలు చెబుతున్నాయన్నారు. జిల్లాలోని అన్ని మండలాలను కరువు మండలాలుగా ప్రకటించాల్సి ఉండగా ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. జిల్లాలో పశువులకు గ్రాసం లేదని ఏకరువు పెట్టారు. ఉచితంగా రైతులకు పశుగ్రాసం పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. జిల్లాలో కరువు పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని రైతులు తీసుకున్న రుణాలు మాఫీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ నెల 23న ఉదయం 11 గంటలకు ప్రెస్ క్లబ్‌లో రౌండ్ టేబుల్ సమా వేశం ఉంటుందని, అఖిలపక్ష పార్టీలు,రైతు,ప్రజా సంఘాలు స్వచ్ఛంద సంస్థలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

వైసీపీకి పోయేకాలం ఆసన్నమైంది..

విశాలాంధ్ర–అనంతపురం: వైసిపి పార్టీకి ముఖ్యమంత్రికి పోయేకాలం దాపురించిందని, టిడిపి శ్రేణులు ఆరోపించాయి. గురువారం అనంతపురం రాంనగర్‌లో బాబుకు తోడుగా ఒక నియంత పై పోరాటానికి మేము సైతం.... రిలే నిరాహార దీక్షలు తొమ్మిదవ రోజు కూడా కొనసాగింది. పెద్ద ఎత్తున వివిధ రంగాలలోని నిపుణులు హాజరై సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా సీనియర్ నాయకులు తలారి ఆదినారాయణ, బుల్లే శివబాల, విజయశ్రీ రెడ్డి, నంగా తేజస్విని మాట్లాడుతూ ఏ తప్పు చేయని మచ్చలేని చంద్రబాబు నాయుడుపై అనవసంమైన కేసులు నమోదు చేసి జైలుకు పంపారన్నారు. ఆరు నెలల్లో తెలుగుదేశం ప్రభుత్వం అధికారంలోకి వస్తుందని, ప్రతి చర్యకు ప్రతి చర్యలు ఉంటాయని, హెచ్చరించారు.

విశాలాంధ్ర శ్రీ సత్యసాయి
www.visalaandhra.com
కర్నూలు, శుక్రవారం 22, సెప్టెంబర్2023

వినాయక నిమజ్జనానికి ప్రతి ఒక్కరూ సహకరించాలి

జిల్లా ఎస్పీ ఎస్పీ మాధవ్ రెడ్డి

విశాలాంధ్ర - హిందూపురం : వినాయక నిమజ్జనానికి ప్రతిఒక్కరూ సహకరించాలని ఎస్పీ మాధవ్‌రెడ్డి అన్నారు. స్థానిక వన్ టౌన్ పోలీస్‌స్టేషన్‌లో బుధవారం శాంతి కమిటీ వినాయక ఉత్సవ కమిటీలతో సమావేశం నిర్వహించారు. శని, ఆదివారాలలో హిందూపురంలో వినాయక నిమజ్జనం కార్యక్రమాలు చేపట్టాలని, ఎలాంటి సమస్యలు తలెత్తకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పోలీసు అధికారులకు సూచనలిచ్చారు. అనంతరం నిమజ్జన సమయాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా సజావుగా జరిగేందుకు హిందూపురంలోని వాల్మీకి నగర్, చిన్న మార్కెట్, ఎంపీ ఎఫ్ నగర్, ఓల్డ్ ఎన్టీఆర్ కాలనీ, అంబేద్కర్ కాలనీ పలు ప్రాంతాలను స్వయంగా పరిశీలించి, భద్రత ఏర్పాట్లపై పోలీసు అధికారులకు పలు సూచనలు చేశారు. అన్ని శాఖల అధికారులు పోలీసులతో సమన్వయం చేసుకొని ఈ నిమజ్జన కార్యక్రమాన్ని ప్రశాంతంగా ముగించాలన్నారు. నిమజ్జనం శోభయాత్ర జరిగే రహదారులు, కూడళ్ల వద్ద బందోబస్తుతో ట్రాఫిక్ అంతరాయం లేకుండా నిర్దేశిత సమయాల్లోనే నిమజ్జనాలు పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నిమజ్జనం చేసే గుడ్డం ప్రాంతం, చెరువులు, కుంటలు వద్ద నిమజ్జనాల సమయంలో ప్రమాదాలు జరగకుండా పోలీసులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, వాహన రాకపోకలకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ట్రాఫిక్ నియంత్రణ చర్యలు వాహనాల దారి మళ్లింపు, భక్తుల భద్రత దృష్ట్యా నిమజ్జనం సమయాల్లో చిన్న పిల్లల భద్రతపై దృష్టి పెట్టాలన్నారు. ఎస్పీ వెంట డీఎస్పీ కంజక్షన్, టౌన్ సిఐ శ్రీనివాసులు, కమిషనర్ ప్రమోద్‌కుమార్, తహసీల్దార్ హసీనా సుల్తానా, మున్సిపల్ వైస్ చైర్మన్ బలరాం రెడ్డి, శాంతి కమిటీ సభ్యులు రమేష్‌రెడ్డి, రాయల్ గోపాల్, హిందూపురం పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం నడుస్తోంది..

విశాలాంధ్ర-పెనుకొండ: నారా చంద్రబాబునాయుడు అక్రమ అరెస్టుపై సత్యసాయి జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బికె.పార్థసారథి ఆధ్వర్యంలో 9వరోజు ఎస్సీ, ఎస్టీ, మైనారిటీల కమిటీలతో సామూహిక నిరాహారదీక్ష నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పార్థసారథి మాట్లాడుతూ రాష్ట్రంలో సైకో జగన్‌రెడ్డి పాలనను ప్రతిఒక్కరూ అసహ్యించుకునే స్థాయికి దిగజారి పోయిందని, అంబేద్కర్ రాజ్యాంగం కాకుండా రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారన్నారు. ప్రజాస్వామ్యవాదులు మేధావులు ప్రతి ఒక్కరూ జగన్ పాలనపై విసుగు చెందుతున్నారు అన్నారు.

గురజాడ గొప్ప అభ్యుదయ కవి

జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి ఆదిశేషు

విశాలాంధ్ర-ధర్మవరం: గురజాడ అప్పారావు గొప్ప అభ్యుదయ కవి అని జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఆదిశేషు అన్నారు. గురువారం గురజాడ జయంతి సందర్భంగా స్థానిక సూర్య స్కూల్లో జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయుడు నరేంద్ర బాబు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జనవిజ్ఞాన వేదిక కవుల నుండి ఏమి కోరుకుంటుందో దాన్ని ఆచరించి చూపిన గొప్ప అభ్యుదయ కవి గురజాడ అన్నారు. గురజాడ గాలిలో మేడలు కట్టలేదు ఆకాశంలో షికార్లు కొట్టలేదు ఉన్నది ఉన్నట్లు చూశాడు.. చూసిందాన్ని చూసినట్లు చెప్పాడన్నారు. దేశమంటే మట్టి కాదు దేశమంటే మనుషులనే నూతన ఒరవడిని సృష్టించిన గురజాడ దేశమంటే భౌగోళిక సరిహద్దులు అనే నానుడిని చెరిపేశాడన్నారు.నేడు కులాల మధ్య, ప్రాంతాల మధ్య, మతాల మధ్య, రాష్ట్రాల మధ్య, జాతుల మధ్య, జాతి-లింగ సమానత్వంపై ద్వేషం, మనుషుల మధ్య ద్వేషం రోజురోజుకు పెరుగుతోందన్నారు. దేశంలో ఉన్న యువత ఈ దేశ పౌరసత్వాన్ని వదులుకొని ఇతర దేశాలకు తరలిపోతున్న ఈ దశలో దేశమును ప్రేమించుమన్నా మంచి అన్నది పెంచుమన్నా అనే గురజాడ దేశభక్తిని విద్యార్థులందరి దగ్గరకు తీసుకుపోవాల్సిన అవసరం ఎంతో ఉందన్నారు. మూఢనమ్మకాలకు వ్యతిరేకంగా ఆయన లేవనెత్తిన అంశాలను, బాల్య వివాహాలకు వ్యతిరేకంగా పోరాడుదామని పిలుపునిచ్చారు.

ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్‌లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

విశాలాంధ్ర-ధర్మవరం : ఉపాధి హామీ పథకంలో గత 17 సంవత్సరాల నుండి విధులు నిర్వర్తిస్తున్న ఫీల్డ్ అసిస్టెంట్లకు ఉద్యోగ భద్రతతో పాటు కనీస వేతనం రూ.20వేలు ఇవ్వాలన్న డిమాండ్లతో కూడిన పత్రాన్ని గురువారం స్థానిక ఎంపీడీవో సౌజన్యకుమారికు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2019 రాష్ట్ర ప్రభుత్వం కొలువుతీరప్పటి నుంచి ఫీల్డ్ అసిస్టెంట్లకు జీతాలు పెంచకపోవడం దారుణమన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, ప్రజా సంకల్ప యాత్రలో ఫీల్డ్ అసిస్టెంట్లకు పార్టీ అధికారంలోకి రాగానే న్యాయం చేస్తానని హామీ ఇచ్చినా అమలులో మాత్రం అందని ద్రాక్ష పండులా అయ్యిందన్నారు. మాన్ డే టార్గెట్ విధానాలు రద్దు చేయాలని, తారతమ్యం లేకుండా అందరినీ ఫీల్డ్ అసిస్టెంట్లుగా గుర్తించాలని, ఎఫ్‌టిఈ వర్తింపజేయాలని పదోన్నతులు కల్పించాలని కోరారు. ప్రమాదవశాత్తు ఎవరైనా చనిపోతే రూ.10 లక్షలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో నరసింహులు, రమేష్, అశోక్, పోతులయ్య, శివ, రామచంద్ర, యుగంధర్ తదితరులు పాల్గొన్నారు.

లడ్డూ కైవసం చేసుకోవడం దైవ ఆశీస్సులే..

విశాలాంధ్ర-ధర్మవరం: పట్టణంలోని ప్రియాంకనగర్‌లో వినాయక చవితి వేడుకలు అత్యంత వైభవంగా గత మూడు రోజులుగా భక్తుల నడుమ జరుపుకున్నారు. ఈ సందర్భంగా వినాయకుని లడ్డును వేలంపాట వేయగా, ఆ వేలంపాటలో 27వ వార్డు కౌన్సిలర్ డోలా ఓబులమ్మ భర్త, ఆర్టీసీ డివిజన్ గౌరవ అధ్యక్షులు డోలా రాజారెడ్డి రూ.13,200లకు కైవసం చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వినాయక చవితి ఉత్సవాలు హిందూ సంస్కృతి, సాంప్రదాయాలకు నిలయమై, హిందూ ఐక్యతను చాటుతుందని తెలిపారు. అనంతరం అన్నదానంతో కార్యక్రమం ముగిసింది.

జగనన్న కాలనీలో : పట్టణంలోని పోతుల నాగేపల్లి జగనన్న కాలనీలో వినాయకుని లడ్డూను వేలం వేయగా సిమెంటు అంగడి ఓంనాథ్ దంపతులు రూ.10,116లకు కైవసం చేసుకున్నారు. లడ్డు మాకు దక్కడం దైవ ఆశీస్సులుగా భావిస్తున్నామని తెలిపారు.

శిరివరం విద్యార్థుల ప్రతిభ..

విశాలాంధ్ర-లేపాక్షి: నియోజకవర్గ స్థాయిలో జరిగిన స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ (ఎస్‌జిఎఫ్) క్రీడా పోటీల్లో మండలంలోని శిరివరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటి జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైనట్టు ప్రధానోపాధ్యాయుడు రవిశంకర్, ఫిజికల్ డైరెక్టర్ సంపత్ కుమార్ గురువారం తెలిపారు. ఈనెల 16, 17 తేదిలలో హిందూపురం పట్టణంలోని ఎంజిఎం పాఠశాల ఆవరణంలో నియోజకవర్గ స్థాయి పోటీలు జరిగాయన్నారు. త్రోబాల్ పోటీల్లో సారాభాను, మైత్రీలు, వాలిబాల్ నందు గాయిత్రీ, బాల్ బాడ్మింటన్లో సుషాంత్, మహీధర్‌లు ప్రతిభ కనబరిచారని తెలిపారు. వారిని హెచ్‌ఎంతో పాటు ఉపాధ్యాయులు అభినందించారు.

దరఖాస్తుల ఆహ్వానం : సీడీపీఓ

విశాలాంధ్ర-కదిరి: ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలోని అంగన్వాడీ సహాయకుల ఉద్యోగాల కొరకు అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఓ రాధిక తెలిపారు. కదిరి అర్బన్ గజ్జల రెడ్డిపల్లి (ఓసి), కదిరి రూరల్ మొటుకు పల్లి(ఓసి) బాలప్ప గారి పల్లి(ఓసి), తలుపుల మండలం కొవ్వూరు వాండ్లపల్లి (బీసీ.బి) వేపల పల్లి తండా (ఏం ఎల్ డి) ఎన్ పికుంట మండలం ఎన్. రెడ్డివారి పల్లి (బిసి.ఎ) జోకల (ఓసి) గ్రామాలకు చెందిన వారు అర్హులన్నారు. స్థానికులై పదవ తరగతి ఉత్తీర్ణత, వివాహితులై ఉండి 21 సంవత్సరం నుండి 35 సంవత్సరాల లోపు వయసు కలిగిన అర్హులన్నారు. ధ్రువీకరణ పత్రాలతో రేషన్ కార్డు, ఆధార్ కార్డులతో ఈనెల 29వ తేదీ సాయంత్రం 5 గంటల లోపు సిడిపిఓ కార్యాలయంలో అందజేయాలని కోరారు.

వైఎస్సార్ బీమా చెక్కు పంపిణీ

విశాలాంధ్ర - హిందూపురం: హిందూపురం రూరల్ పరిధిలోని చౌలూరు సచివాలయం-1 పరిధిలో గల వంటి కదిరప్ప ఇటీవల మరణించాడు. తక్షణ సహాయం కింద రూ.10 వేల వైయస్సార్ బీమా చెక్కును భార్య సావిత్రమ్మకు వైసీపీ నాయకురాలు చౌలూరు మధుమతి రెడ్డి అందించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ రత్నమ్మ, సర్పంచ్ నంజప్ప పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులో గిఫ్ట్ బాక్స్ ఏర్పాటు

విశాలాంధ్ర-లేపాక్షి: ఏపియస్ఆర్టీసీ హిందూపురం డిపో ఆధ్వర్యంలో హిందూపురం-కొడికొండ చెకోపోస్టుకు తిరుగు బస్సులలో గిఫ్ట్ బాక్సు ఏర్పాటు చేసినట్టు డిపో మేనేజర్ అంపన్న, లేపాక్షి ఆర్టీసీ కంట్రోలర్ భాషా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రయాణికులు బస్సు దిగునపుడు తమ టికెట్ వెనుక పేరు, చిరునామా, ఫోన్ నెంబరు రాసి తమ గిఫ్ట్ బాక్సులో వేయాలన్నారు. ప్రతి నెలా 15న లక్కీడ్రా ద్వారా బహుమతి అందజేస్తామన్నారు. ఈ గిఫ్టును వైష్ణవి ఆసుపత్రి వి.అనీల్ స్పాన్సర్ చేస్తారన్నారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

విశాలాంధ్ర-కదిరి: నేడు గణేష్ నిమజ్జనం సందర్భంగా విద్యుత్ సరఫరాలో శుక్రవారం అంతరాయం ఉంటుందని ఏఈ చెన్న కృష్ణ తెలిపారు. కాలేజ్ సర్కిల్ నుండి హిందూపురం రోడ్, ముత్యాల చెరువు వరకు మారుతి నగర్,జొన్న స్ట్రీట్, నల్లగుట్ట, ఎంజీ రోడ్, పూల బజార్, తెరు బజార్, టెంపుల్ స్ట్రీట్, మగ్గాల క్వార్టర్స్, పార్థసారథి కాలనీ ఏరియాలలో నిమజ్జనం అనంతరం సరఫరా విద్యుత్ సరఫరా పునరుద్ధరిస్తామని తెలిపారు.

23న చింత తోపు సేకరణకు వేలం

విశాలాంధ్ర-గుడిబండ: గుడిబండ గ్రామపంచాయతీ పరిధిలోని చింత తోపుకు ఈ నెల 23న వేలంపాట నిర్వహిస్తున్నట్లు ఈఓఆర్డి నాగరాజు నాయక్ తెలిపారు. 2023 -2024 ఆర్థిక సంవత్సరంగాను ధరావత్తు రూ.5వేలు చెల్లించి పాటలో పాల్గొనాలన్నారు

చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా రావాలి

సత్య సాయి జిల్లా దేశం అధ్యక్షులు

విశాలాంధ్ర-రొద్దం: మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కడిగిన ముత్యంలా జైలు నుంచి బయటకు రావాలని ఆకాంక్షిస్తూ&ంత టీడీపీ జిల్లా అధ్యక్షులు, పెనుగొండ మాజీ ఎమ్మెల్యే బీకే పార్థసారథి గురువారం స్థానిక లక్ష్మీ ప్రసన్న వెంకటేశ్వర స్వామికి పూజలు అభిషేకాలు నిర్వహించారు. స్వామికి 101 టెంకాయలను కొట్టి మొక్కుకున్నారు. ఈ సందర్భంగా పాత్రికేయలతో మాట్లాడుతూ సైకో జగన్‌కు మంచి బుద్ధి ప్రసాదించాలని శ్రీ లక్ష్మీ వెంకటేష్ స్వామిని కోరుకున్నట్లు చెప్పారు. ఒక్క ఛాన్స్ ఇవ్వండి అంటే ప్రజలు నమ్మి ఓటు వేసి గెలిపిస్తే అధికారాన్ని అడ్డుపెట్టుకుని ఏ తప్పు చేయని చంద్రబాబుని అక్రమ అరెస్టు చేసి జైలుకు పంపి జగన్ మోహన్‌రెడ్డి పైశాచిక ఆనందం పొందుతున్నారని విమర్శించారు.

యువతకు గురజాడ ఆదర్శప్రాయుడు

విశాలాంధ్ర-బుక్కపట్నం : మండల కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల నందు గురజాడ అప్పారావు జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ప్రిన్సిపాల్ రవికుమార్ మాట్లాడుతూ గురజాడ అప్పారావు తన రచనల ద్వారా ప్రజలను చైతన్య పరుస్తూ. బాల్యవివాహాలను అరికట్టడంలో తనదైన ముద్ర వేసుకున్నారని తెలిపారు. ఆయన సేవలు నేటి తరం యువతకు ఆదర్శమన్నారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది వెంకటేశ్వర ప్రసాద్, వెంకట కృష్ణయ్య, గంగరాజు, శ్రీనివాసులు పాల్గొన్నారు.

గంగమ్మ ఆలయ నిర్మాణ కమిటీ ఎన్నిక

విశాలాంధ్ర-తనకల్లు: మండల కేంద్రంలోని రజక సంఘం నాయకుల ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించ తలపెట్టిన గంగమ్మ ఆలయ నిర్మాణ కమిటీని గురువారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా డి.గంగాధర్, గౌరవ అధ్యక్షుడిగా డి.అంజన్ కుమార్, ఉపాధ్యక్షుడిగా ఈ. నారాయణ, శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శులుగా ఈ.హరినాథ్, శ్రీరాములు, పి.మల్లికార్జున, కోశాధికారిగా ఆంజనేయులు, కమిటీ సభ్యులుగా వై.అనిల్, వెంకటప్ప, ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ ఆలయ కమిటీ నిర్మాణానికి కదిరి నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్ కందికుంట వెంకటప్రసాద్ 50 వేల రూపాయలు ఆర్థిక సహాయం అందించారు. ఆలయ కమిటీ సభ్యులు గ్రామ ప్రజలు ఆయనకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ఇంటర్ విద్యార్థిని ఆత్మహత్య

విశాలాంధ్ర-బత్తలపల్లి: డీ.చెర్లోపల్లి చెందిన సుధా వెంకటరమణ కుమార్తె సుధా స్రవంతి(16) పదో తరగతి సప్లమెంటరీ ఫలితాల్లో ఫెయిల్ కావడంతో మనస్తాపం చెంది ఇంట్లో గడ్డి మందు తాగింది. అనంతపురంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ కోలుకోలేక మృతి చెందినట్లు బత్తలపల్లి పోలీసులు పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

షార్టు సర్క్యూట్‌తో బూడిదైన సామగ్రి

విశాలాంధ్ర- ఓ డి సి - రూరల్: ఓబుళదేవర చెరువు. మండల పరిధిలోని మామిళ్ళ కుంట్ల పల్లి గ్రామానికి చెందిన ఎద్దుల శంకర్ రెడ్డి నివాసంలో బుధవారం అర్ధరాత్రి సమయంలో విద్యుత్ షాట్ సర్క్యుట్ వలన ఇంట్లోని కంప్యూటర్, లాప్ టాప్, ప్రింటర్ విలువైన వస్తువులు బూడిద పాలయ్యాయని వారి కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీర య్యారు. గతంలో నిర్వహించిన కొరియర్ కంపెనీకి సంబంధించిన డాక్యుమెంట్లు, పార్సెల్స్, ఇంట్లోనే అన్ని వస్తువులు కళ్ల ముందరే మంటల్లో కాలిపోవడం జరిగిందని, తమ కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని శంకర్ రెడ్డి కుటుంబ సభ్యులు కోరారు.

వాహనం బోల్తా.. ఒకరు మృతి

విశాలాంధ్ర- ముదిగుబ్బ: ముది గుబ్బ మండల కేంద్రంలో రెండు జిమాసుల సమీపాన ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తా పడగా ఒకరు మృతి చెందారు. అంజి తన మామ శ్రీరాములుకు చికిత్స కోసం పొద్దుటూరుకు వెళ్లి గాయానికి కట్టుకట్టించుకొని తిరుగు ప్రయాణంలో ముదిగుబ్బ సమీపాన రెండు జీమాసుల వద్ద ద్విచక్ర వాహనం అదుపుతప్పి బోల్తాపడడంతో వీరాంజనేయులు అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడు వీరాంజనేయులు హమాలి పనిచేస్తూ జీవించేవాడు. శ్రీరాములుకు తీవ్ర గాయాలయ్యాయి. ముదిగుబ్బ పోలీసులు క్షతగాత్రుని 108లో బత్తలపల్లి ఆర్డిటి ఆసుపత్రికి తరలించారు.

ధర్మవరానికి చేరిన ట్రయల్ రన్ వందే భారత్

విశాలాంధ్ర-ధర్మవరం: ధర్మవరం పట్టణానికి వందే భారత్ రైలు గురువారం ఉదయం 11 : 15 నిమిషాలకు చేరుకొంది. ఈ సందర్భంగా రైల్వే అధికారులు, ప్రయాణికులు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా స్టేషన్ మాస్టర్ నరసింహా నాయుడు మాట్లాడుతూ ఈ ట్రైల్ రన్ వందే మాతరం రైలులో ఐపీఎఫ్ కుమార్, అసిస్టెంట్ ఆపరేషన్ మేనేజర్ గుంతకల్- పూర్ణచంద్రరావు రావడం జరిగిందని తెలిపారు. తదుపరి రైలు 11.20లకు బెంగళూరుకు బయలుదేరిందన్నారు. వందేమాతరం రైలు ప్రాధాన్యత, సౌకర్యాలను తెలియజేశారు.

యోగా పోటీలను సద్వినియోగం చేసుకోండి

విశాలాంధ్ర-ధర్మవరం: జిల్లాస్థాయి యోగాసనా పోటీలు- యోగాసనా స్పోర్ట్స్ అసోసియేషన్ ఆఫ్ అనంతపురం అండ్ సత్యసాయి జిల్లాల ఆధ్వర్యంలో ఈ నెల 24వ తేదీ ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు వివేకానంద భవన్, నియర్ చర్చి స్కూలు, రెవెన్యూ కాలనీ -అనంతపురం నందు నిర్వహిస్తున్నట్లు శ్రీ సత్యసాయి జిల్లా స్పోర్ట్స్ యోగా అసోసియేషన్ అధ్యక్షులు గాజుల సోమేశ్వర్‌రెడ్డి తెలిపారు. గురువారం ధర్మవరంలోని సాంస్కృతిక మండలిలో కరపత్రాలను విడుదల చేశారు. యోగాసనా పోటీలకు 9 సంవత్సరాల నుంచి 55 సంవత్సరాల వయస్సు ఉన్నవారు పాల్గొనవచ్చని, వయసును బట్టి ఆరు భాగాలుగా పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. విజేతలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి సుబ్బారాయుడు, సాంస్కృతిక మండలి వ్యవస్థాపకులు సత్రశాల ప్రసన్నకుమార్, యోగ ఆర్గనైజర్ నరసింహుల పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యను అందించండి

విశాలాంధ్ర-ధర్మవరం: పాఠశాలలో విద్యార్థులందరికీ నాణ్యమైన విద్యనందించేలా మరింత కృషి చేయాలని ఎంఈఓ-2. గోపాల్ నాయక్ పేర్కొన్నారు. గురువారం పట్టణంలోని వంశీకృష్ణ హైస్కూలును ఆకస్మికంగా తనిఖీ నిర్వహించారు. రికార్డులను, బస్సుల ఫిట్నెస్ సర్టిఫికెట్లను, కండిషన్లు పరిశీలించారు. విద్యార్థుల అడ్మిషన్ వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు అయ్యాయా? లేదా? అన్న వాటిని కూడా క్షుణ్ణంగా పరిశీలించారు. కార్యక్రమంలో కరెస్పాండెంట్ బీరే గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

క్రీడల్లో యశోద కాన్సెప్ట్ విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-ధర్మవరం: ఇటీవల జమ్మలమడుగులోని విడుదలూరులో జరిగిన టార్గెట్ బాల్ ఇంటర్ డిస్టిక్ సబ్ జూనియర్స్ పోటీలలో పట్టణంలోని యశోద కాన్సెప్ట్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరచడం జరిగిందని ప్రిన్సిపాల్ అనుప్ ,డైరెక్టర్ పృథ్వీరాజ్ తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఇంటర్ డిస్టిక్ సబ్ జూనియర్స్ పోటీలలో మా విద్యార్థులు మంచి ప్రతిభను కనబరిచి, ఆణిముత్యములాగా పోరాడి, మూడో స్థానం దక్కించుకున్నారని వారు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మా పాఠశాలలో చదువుతో పాటు క్రీడలు కూడా నేర్పుతూ, రాష్ట్ర, జాతీయ స్థాయిలలో మంచి గుర్తింపు పొందడం పట్ల వారు ఆనందాన్ని వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థి జీవితంలో ఒక లక్ష్యమును ఎంచుకోవాలని, ఇందులో క్రీడల్లో మంచి ప్రతిభ కనపరిస్తే, ఉజ్వల భవిష్యత్తు ఏర్పడుతుందని తెలిపారు. తదుపరి ప్రిన్సిపాల్, డైరెక్టర్లతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులు అశోక్, మణికంఠ, జ్యోతి అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

విభిన్న ప్రతిభావంతుల ఆటల పోటీలు ప్రారంభం

విశాలాంధ్ర-కొత్తచెరువు: విభిన్న ప్రతిభావంతులు ఆటల పోటీలను సద్వినియోగం చేసుకోవాలని డీఈవో మీనాక్షి, జిల్లా విద్య విభాగపు కోఆర్డినేటర్ ఆనంద్‌బాబు తెలిపారు. గురువారం జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల మైదానంలో జిల్లా విభిన్న ప్రతిభావంతుల ఆటల పోటీలు ముఖ్య అతిథులుగా విచ్చేసి ప్రారంభించారు. జిల్లాలోనే 32 మండలాల నుండి ప్రభుత్వ పాఠశాలలో చదివే విభిన్న ప్రతిభావంతులు 250 మంది విచ్చేసి వీరికి వ్యాయామ ఉపాధ్యాయులు పోటీలు నిర్వహించి ఇందులో ప్రథమ ద్వితీయ స్థాయిలో ఎంపికైన ప్రతిభావంతో పిల్లలను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేయడం జరుగుతుందన్నారు. పరుగు పందెం సాఫ్ట్బాల్ త్రో స్లో వాక్ లాంగ్ జంప్ షాట్‌పుట్ నిర్వహించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ డైరెక్టర్ రామకృష్ణ, కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపాల్ చంద్రమౌళి, పీఈటీలు నాగరాజు, అంజన్న, ఆనంద్‌బాబు, వెంకటేష్, రామకృష్ణ తదితరులు ఉపాధ్యాయులు శ్రీనివాసులు పాల్గొన్నారు.

30 సంవత్సరాల కల నెరవేర్చిన మోడీ

కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ చంద్రశేఖర్

విశాలాంధ్ర - అగళి : భారత ప్రధాని నారి శక్తి వందన్ మహిళా బిల్లును మంత్రివర్గం ఆమోదించి చట్టసభలలో పెట్టేందుకు మార్గం సుగమం చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. పెనుకొండ రోడ్డు సుకన్య ఆసుపత్రి ఆవరణంలో జిల్లా మహిళా మోర్చా ప్రధాన కార్యదర్శి విక్టోరియా రాణి కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జ్ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో కార్యక్రమం నిర్వహించారు. చంద్రశేఖర్ మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా మహిళా బిల్లు కోసం గత ప్రభుత్వాలు మాటలకే పరిమితమైన మోడీ ప్రభుత్వం బిల్లును ప్రవేశపెట్టిన సందర్భంగా కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలియజేసారు. మహిళలకు చట్టసభల్లో 33 శాతం అధికారాన్ని కల్పిస్తూ చేసిన బిల్లుతో పార్లమెంట్ అసెంబ్లీలో ఎంపీలు ఎమ్మెల్యేలుగాను మహిళలు ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక అవుతాయాన్నారు. మహిళలకు తగిన గుర్తింపించిన ప్రధానిగా చిరస్థాయిగా నిలిచిపోతారని తెలియజేశారు దేశంలోని తొమ్మిది కోట్ల మంది మహిళలకు ఉజ్వల పథకం ద్వారా ఉచితంగా గ్యాస్ కనెక్షన్ ఇచ్చి ఎంఎస్ ఎంఈ పథకం ద్వారా చిన్న తరహా పరిశ్రమల స్థాపించుటకు దేశవ్యాప్తంగా 11 కోట్ల మంది మహిళలకు మరుగుదొడ్లు నిర్మించటం ద్వారా అభిమానాన్ని చాటుకున్నారని కొనియాడారు అన్ని పార్టీలు 33 శాతం మహిళా బిల్లుకు మద్దతు ఇచ్చి మహిళల పట్ల గౌరవాన్ని చాటుకున్న నరేంద్ర మోడీ ప్రభుత్వంలోని బిజెపిని ప్రతి ఒక్కరూ ఆదరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి విక్టోరియా రాణి మహిళా మోర్చా మండల అధ్యక్షులు కవిత మహిళానాయకురాలు సుకన్య కవిత వనిత జ్యోతి మండల పట్టణ సీనియర్ నాయకులు కె ఆర్ వి గుప్తా కిసాన్ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి దొడ్డ రంగయ్య గౌడ్ అధ్యక్షులు మెలవాయి నాగరాజు పట్టణ ప్రధాన కార్యదర్శి శివకుమార్ మండల ప్రధాన కార్యదర్శి సుబ్బరాయుడు పట్టణ ఉపాధ్యక్షులు బాందాస్ మండల ఎస్సీ మోర్చా అధ్యక్షులు మఠం లక్ష్మీనారాయణ కిసాన్ మోర్చా జిల్లా కార్యదర్శి చిదానంద నాయుడు నారాయణ నరసింహ శ్రీధర్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కిసాన్ మోర్చా రాయలసీమ జోనల్ ఇంచార్జి చంద్రశేఖర్